# మాయమనసులు



మెల్లి మెల్లిగా రాత్రి అంతరిస్తోంది పశ్చిమ దిక్కున చంద్రుడు క్షీణిస్తూ కన్పించాడు చుక్కలు వెలా తెలా బోతున్నాయి

పార్థసారథి బస్‌స్టాండ్ వైపు నడుస్తున్నాడు అతని చేతిలో చిన్న సూట్‌కేస్, చేతితోపాటు ముందుకు వెనక్కు ఊయలలా ఊగుతోంది అతని కాళ్ళ బూట్లు లయ బద్ధంగా శబ్దం చేస్తున్నాయి

వెనక నుంచి వస్తున్న బూటు చప్పుడు విని ముందు నడుస్తున్న ఒక యువతి, యువకుడు ఆగారు

"హల్లో! సారధీ! ఎక్కడికి ప్రయాణం?"

"హైదరాబాద్ వెళ్తున్నాను విజయ్!" అన్నాడు సారధి హుషారుగా

విజయ్ చిరునవ్వు నవ్వాడు "ఏమిటి విశేషం?"

"అక్కడొక పెద్ద కంపెనీలో ఉద్యోగాలున్నాయని తెలిసింది ప్రయత్నించుదామని "

"విష్‌యూ! బెస్ట్ ఆఫ్ లక్!" అని షేక్ హాండ్ ఇచ్చాడు విజయ్

"థాంక్స్!" చెప్పాడు సారధి

ఆ అమ్మాయి వారి మాటలు వింటూ నేల చూపులు చూస్తోంది

ముగ్గురూ కదిలారు

తూర్పు నలుపు నుంచి కెంపు వర్ణానికి మారిపోతోంది ఆపైన ఆకాశంలో తెల్లటి మేఘాలు ఒకదానిపైన ఒకటి నిల్చుని మంచుకొండల్లా కన్పిస్తున్నాయి ఇంతలో కళ్ళు నులుముకుంటూ లేచాడు సూర్యుడు

బస్టాండ్‌లో సిమెంట్ బెంచీ మీద కూర్చున్నారు విజయ్, అతని భార్య

పార్థసారధి ఏదో మొఖమాటానికి రెండు మాటలు మాట్లాడాడు కాని విజయ్ అంటే అంతులేని అసహ్యం

'పైకి మేడిపండులా కన్పిస్తాడు వెధవ లోపలన్నీ పురుగులే లుక లుక మంటూ' అనుకున్నాడు సారధి

క్యాంటీన్‌లోకి వెళ్ళి టీ త్రాగుతూ కూర్చున్నాడు ఆలోచనలు విజయ్ మీదికి పోయాయి విజయ్ తనకి బి కామ్. లో క్లాస్‌మేట్ ఏమంత వున్నవారు కాదు వాళ్ళ నాన్న రోడ్ల గుమస్తా

ఎలా వల్లో వేసుకున్నాడో దొంగ వెధవ, ఇంటర్ చదువుతున్న కమలని' ఆమె గూడా మధ్య తరగతి కుటుంబం లోదే. కట్నాలకు భయపడి వాళ్ళ నాన్న పెళ్ళి చేయలేక చదివిస్తున్నాడు.

విజయ్, కమల పెళ్ళి చేసుకుంటారని అంతా అనుకున్నారు కమల గర్భవతి అయ్యింది విజయ్ మొఖం తప్పించాడు కమల అవమానం భరించలేక ఆత్మహత్య చేసుకుంది

విజయ్ బి కామ్ ప్యాసయిన వెంటనే ఎవరో బాగా వున్నవారే పదివేలు కట్నం ఇచ్చి, బ్యాంక్‌లో ఉద్యోగం వేయించి, మల్లెపూవులాంటి పిల్లనిచ్చి పెళ్ళిచేశారు.

'విషప్పురుగు అయితేనేం వాడి జాతకం బాగుంది సుఖంగా వున్నాడు వెధవ' అనుకుని ఈర్ష్యపడ్డాడు సారధి

అయితే పార్థసారధికి, విజయ్‌కి వేరే మనస్పర్ధలు ఏవీ లేవు కమలను మోసం చేశాడే' అనేదే అతనికి విరిగిన ముల్లులా బాధపెడుతుంది అందుకే అతనంటే అసహ్యం


'సంవత్సరాల తరబడి ప్రేమిస్తున్నానని వెంటబడడం, అమాయకురాల్ని చేసి లొంగదీసుకోవడం, తీరా కొంప మునగబోయే సమయానికి తేలుకుట్టిన దొంగలా కిక్కురుమనకుండా వుడాయించడం ఎలా మనసు ఒప్పుతుందో? ఇటువంటి వారే సంఘంలో చీడపురుగులు తనకే గనక అధికారం వుంటే ఇటువంటి దుర్మార్గుల్ని ఏరి తుపాకీతో కాల్పించి వుందును' తనకి అధికారం లేనందుకు విచారపడ్డాడు పార్థసారధి

హైద్రాబాద్ వెళ్ళే సూపర్ డీలక్స్ బస్సు డిపోలో నుంచి ప్లాట్‌ఫారం మీదకు రావడం చూచి సారధి క్యాంటీన్‌లోనుంచి బైటకు వచ్చాడు

బస్సు కదిలింది ఊరు దాటిందాకా తాబేలు నడక నడిచింది తర్వాత కోడె కారు కుర్రాడిలా భయం లేకుండా దూకుతోంది

బస్సుతోపాటు పోటీపడి కాలం పరిగెత్తుతూంది

ఏదో పల్లెటూరు ఎడ్లబళ్ళు అడ్డంవచ్చినట్లుంది. బస్సు ఆగింది కిటికీలోంచి




ప్రక్కకు చూశాడు

ఆ ఊరి చెరువు ప్రబంధనాయకి సిగలా తామరలు నింపుకొని వుంది అందులో నీళ్ళు సూర్యకాంతి పడి మిలమిల మెరుస్తున్నాయి ఆ నీళ్ళలో తెల్లటి బాతుల జంట స్వేచ్ఛా విహారం చేస్తున్నాయి

ఎర్రటి బట్టలతో, ముద్దమందారం లాంటి పడుచుపిల్ల, బంగారంలా మెరిసి పోతున్న బిందెను నీళ్ళలో ముంచు తున్నది

ఎవరదీ? రాధా?

కాదు. రాధలా వుండే రాధ యిక్క డెలా వుంటుంది? హైదరాబాద్ లో వుంటేను

బస్సు కదిలింది పార్థసారధి నవ్వు కున్నాడు.

'రాధ' ఎంత మధురమైన ఆలోచన.

తదియనాటి వెన్నెల్లో, సన్నజాజి పందిరి క్రింద, ఆఖరిసారి అనురాగంగా, తడి కళ్ళతో, ఒకళ్ళ నొకళ్ళు చూసుకున్న దృశ్యం కళ్ళకు కట్టింది

వేకువ జామునే వాళ్ళ కుటుంబం హైదరాబాద్ వెళ్ళిపోతున్నారు ఆఖరి సారి వీడ్కోలు తీసుకోవడానికి వచ్చింది రాధ

తెల్లటి దుస్తుల్లో, తొలిసారి పరిమళి స్తున్న మల్లెపువ్వులా వుంది రాధ తలను కప్పుకున్న చీర చెంగు మంచు పొరలా వుంది

"నన్ను మర్చిపోవుగా?" నీళ్ళు నిండిన కళ్ళతో చూసింది

"నువ్వంటే నాకు ఎంత ఇష్టమో? ఎలా

చెప్పను రాధా?" అన్నాడు సారధి

"మనం మనం " ఏదో చెప్పాలని ఆతృత, ఏమీ చెప్పలేని బేలతనం

సారధి గ్రహించాడు "దిగులుపడకు రాధా! బ్రతికుంటే మాత్రం నిన్నే పెళ్ళి చేసుకుంటాను" ఉద్వేగంగా అన్నాడు

"అవేం మాటలు " అని, రాబోతున్న దుఃఖాన్ని పెదవులతోనే ఆపుకుని, వణుకుతున్న చేతులతో అతని నోటిని మూసింది

ఆమె అరచేతిని ముద్దుపెట్టుకున్నాడు

ఇంతలో ఎక్కడో అలికిడి అయ్యింది రాధ కంగారుగా, భయంగా తడబడుతున్న అడుగులతో వెళ్ళిపోయింది

కృష్ణమూర్తి, సారధి ఒకే కాలేజీలో చదివారు అతని చెల్లెలే రాధ

కృష్ణమూర్తి తండ్రి రైతు టౌన్‌కు ప్రక్కనున్న పల్లెలో పొలాలున్నాయి పిల్లల చదువు గురించి ఇక్కడే ఇల్లు తీసుకుని వుంటున్నది తల్లి

ప్రక్క, ప్రక్కన ఇళ్ళు అవడంవలన బంధువుల్లా కలిసిపోయారు రాధ స్కూల్ ఫైనల్‌తో చదువు మానేసింది మరుసటి సంవత్సరమే వాళ్ళు హైదరాబాద్ వెళ్ళిపోయారు

చాలా సాంప్రదాయం గల కుటుంబం వాళ్ళది చాలా మంచి మనుషులు అని ఆ వీధిలో పేరు తెచ్చుకున్నారు వాళ్ళు వెళ్ళిపోతుంటే ఆ వీధి వీధంతా కళ్ళ నీళ్ళు పెట్టుకున్నారు ఆ వీధిలో వాళ్ళంతా ఎప్పుడో ఒకప్పుడు వాళ్ళవల్ల ఉపకారం పొందినవాళ్ళే.

పార్థసారధి వాళ్ళ కుటుంబం మంచి తనపు తాలూకు ఛాయ ఒకటి ఎన్నటికీ మర్చిపోలేదు

ఇంటర్ ప్యాసయ్యాడు బి కామ్. చదవడానికి శక్తిలేదు తమకి చదువు మానేసి ఉద్యోగం వెతుక్కోమంటున్నాడు తండ్రి అమ్మడానికైనా ఇంకా ఏం మిగిలాయి? అనుకుంటున్నది తల్లి ఆ పూట ముగ్గురూ గంభీరంగా వున్నారు

ఎందుకో అటువచ్చింది కృష్ణమూర్తి తల్లి ఇంట్లో ముగ్గురూ మౌనంగా, విచారంగా వుండడం గమనించి "ఏమిటి?" అని అడిగింది

'సారధి చదువు గురించి' అని అంతా చెప్పింది అమ్మ విని వెళ్ళిపోయింది ఆమె

"అందరూ అడిగే వాళ్ళే ఆర్చే వాళ్ళా?" అంది అమ్మ


నాన్న కోపంగా చూశాడు

ఇంతలో ఆమె వచ్చింది మొదటి టరమ్ ఫీజుకి, పుస్తకాలకి సరిపడా డబ్బు తెచ్చి తన చేతిలో పెట్టి 'నువ్వు దిగులుపడకురా అబ్బాయ్! ఇంటి గొడవలు పట్టించుకోకు, శ్రద్ధగా చదువుకో!" అంది ఆమె

ఆ క్షణంలో ఆమె ఆపదలో ఆదుకున్న ఆదిదేవతలా కన్పించింది. తన కళ్ళల్లో నీళ్లు తిరిగాయి అవి రాలకుండా బలవంతంగా ఆపుతున్నాడు అది సంతోషమో, దుఃఖమో తనకి అర్థం కాలేదు

"నీ ఋణం ఎలా తీర్చుకోము వదినా?" అంది అమ్మ

"ఇంతమాత్రానికే అంత పెద్ద మాటలెందుకు వదినా! నాకు ఒక కొడుకు,




కూతురు వున్నారు వీడిని మాలో కలుపుకుంటాం" మహాలక్ష్మిలా నవ్వింది.

ఆ రెండేళ్ళూ వాళ్ళ సహాయం అందుతూనే వుంది

"మనవాడి చదువుకు సాయపడుతున్నారు గదా, రాధ నివ్వాలనుకుంటున్నారేమో," అంది అమ్మ ఒకసారి నాన్నతో

"ఆశలు వుండవచ్చునుగాని దురాశ వుండగూడదు వాళ్ళు స్థితిమంతులు తూగలేం" అన్నాడు నాన్న

"ఏమో, అలా అనిపించింది నాకు" అంది అమ్మ ఉత్సాహం జారిపోతుండగా

కాని రాధ తనను మనస్ఫూర్తిగా ప్రేమించి తననే హృదయం నిండా నింపుకొన్నదని తనకు తెలుసు

ప్రేమ గురించి నోటితో మాట్లాడుకోకపోయినా, కళ్ళతో పలకరించుకొనేవారు హృదయాలతో ముచ్చటించుకొనేవారు

రాధను చూడడానికే కళ్ళున్నాయి.

రాధను తలుచుకోడానికే మనసుంది.

రాధను ఆరాధించడానికే హృదయం వుంది

రాధను పెళ్ళి చేసుకోడానికే తను పుట్టాడు.

ఎంత తృప్తిగా వుండేది రాధ కనిపిస్తుంటే.

రాధ వెళ్ళిపోయింది ఆ క్రొత్తల్లో ఎంత దిగులుగా వుండేది? లెటర్ రాద్దామనుకునేవాడు. కాని వాళ్లేమనుకుంటారు? చనువిచ్చామని నెత్తి నెక్కాడనుకోరూ? అసలు వాళ్ళకు ఆ ఉద్దేశ్యం వుందో లేదో? అనేక అనుమానాలు వచ్చి వూరుకొనేవాడు.

ఎలాగయితేనేం మంచి రోజులు రాబోతున్నాయి. దేవుడి దయవల్ల ఈ ఉద్యోగం

వచ్చిందంటే, తను వాళ్ళింట్లోనే వుండి పోతాడు తనకొక ఆధారం ఏర్పడుతుంది గనుక పెళ్ళి గురించి కృష్ణమూర్తిని కదిలించవచ్చు

"సారధీ! భోజనం చెయ్యవూ?" అంటున్నాడు విజయ్

సారధి ఆలోచనల తీగ తెగిపోయింది

బస్సు ఆగి వుంది టైమ్ పన్నెండు న్నర అయ్యింది తనింతసేపూ ఊహా లోకంలోనే వున్నాడన్న మాట తనలో తను నవ్వుకుని సీటులోంచి పైకి లేచాడు సారధి.

భోజనాలు పూర్తయ్యాక బయలు దేరింది బస్సు

* * *

పది నిముషాలు ఆలస్యంగా వెళ్ళి వుంటే కృష్ణమూర్తి ఆఫీసునుంచి ఇంటికి వెళ్ళిపోయి వుండేవాడు

కృష్ణమూర్తిని గుర్తుపట్టలేదు సారధి చాలా మారిపోయాడు. ముసలి ఏనుగులా చిక్కిపోయాడు కళ్ళు గుంటలు పడి వున్నాయి

పార్ధసారధిని చూసి చాలా సంతో షించాడు కృష్ణమూర్తి

"ఏమిటోయ్ అలా చిక్కిపోయావ్?" అన్నాడు సారధి

నవ్వి వూరుకున్నాడు కృష్ణమూర్తి

తను వచ్చిన పని చెప్పాడు సారధి.

కృష్ణమూర్తి 'వూఁ' కొట్టాడు.

ఇద్దరూ ఇంటికి బయల్దేరారు

కృష్ణమూర్తి నెమ్మదిగా మాట్లాడుతు న్నాడు

గంభీరంగా, హుందాగా మాట్లాడే కృష్ణమూర్తే నా? నెమ్మదిగా తూచి, తూచి మాట్లాడుతున్నాడు కోడెదూడలా ఎప్పుడూ చలాకీగా.వుండేవాడేనా భారంగా అడుగులు వేస్తున్నాడు'

నాలుగేళ్ళనాటి కృష్ణమూర్తికీ, ఇప్పటి కృష్ణమూర్తికీ ఎంతో తేడా కనిపించింది. అతన్ని చూచి చలించిపోయాడు సారధి

"ఇల్లు చాలా దూరం" అని రిక్షా మాట్లాడాడు కృష్ణమూర్తి

పార్ధసారధి రిక్షాలో కూర్చున్నాడు

వెనక సైకిల్ మీద బయలుదేరాడు కృష్ణమూర్తి

సీతారామ్‌బాగ్‌లో ఆగింది రిక్షా

పాడుబడిన దేవాలయం చింతచెట్ల తోపు ఎప్పటివో పాత యిళ్ళు రోడ్లు మురికిగా వున్నాయి హైదరాబాద్ వచ్చానా? లేక హంపీ వచ్చానా? అనుకు న్నాడు సారధి

ఆ వాతావరణం చూసి సిటీ వచ్చా నన్న అతని ఆనందం ఆవిరిలా మాయ మైంది

కృష్ణమూర్తి వుంటున్న అద్దెకొంప చూసి నల్లమబ్బులతో మూసుకుపోయిన ఆకాశంలా అయ్యింది అతని ముఖం

ఎప్పటిదో పాత యిల్లు అందులో మూడు భాగాలున్నాయి వుండేవాళ్ళంతా దరిద్రులే. పిల్లాజెల్లాతో రణగొణ ధ్వనిగా వుంది

కృష్ణమూర్తి సైకిల్ ప్రహరీ గోడకు ఆనించి "రా" అన్నాడు పార్ధసారధిని

"అమ్మా! మన సారధి వచ్చాడు" అంటూ ఇంట్లోకి వెళ్లాడు కృష్ణమూర్తి.

"ఎవరూ? " అంటూ ఆమె బైట్కి



సినిమా పేరైతే 'అదృష్టవంతురాలు' గానీ అంత అదృష్టం కలిగినదానిలా కన్పించని ప్రభను వీక్షిస్తున్నారు చలం, దేవదాస్

వచ్చింది.

కృష్ణమూర్తి తల్లిని చూసి మరింత ఆశ్చర్యపోయాడు సారధి మేత లేక ఎండిపోయిన ఆవులా కన్పించింది ఆమె

"రా! సారధీ అమ్మా నాన్న బావున్నారా!" అంటూ యింట్లోకి ఆహ్వానించింది

ఇల్లా అది! పావురాళ్ళుండే గూళ్ళు నయం అవి కాస్త అటూ యిటూ కదలడానికయినా వీలుంటుంది

రెండే గదులు

ముందు గదిలో చెక్క కుర్చీలో కూర్చున్నాడు సారధి

ఎవరీ క్రొత్త మనిషి, అన్నట్లు కిర్రు మని మూలిగిందది విరుగుతుందో ఏమోనని ఒదిగి కూర్చున్నాడు

ఆ కుర్చీ ప్రక్కనే కుక్కిమంచంలో శవంలా ఒక ముసలాయన పడుకొని వున్నాడు అస్థిపంజరానికి తోలు కుట్టి ప్రాణం పోసినట్లున్నాడు దేవుడు గడ్డం పెరిగిపోయి వుంది కాళ్ళు చేతులు పుల్లల్లా వున్నాయి గాజు గుడ్లు పెద్దవి చేసి చూశాడు

"ఆయనకి పక్షవాతం వచ్చింది" అంది ఆమె సారధి వంక చూస్తూ

కృష్ణమూర్తి తండ్రా?

ఎవరో అతని కడుపులో చెయ్యిపెట్టి దేవినట్లయింది

"కాఫీ."

కాలెత్తి చూశాడు సారథి.

రాధ కాఫీ గ్లాసు పట్టుకుని నిల్చుంది. అతని కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. ఆ

నీళ్ళు లైటు కాంతికి తళతళ మెరుస్తున్నాయి తల త్రిప్పుకుని తుడుచుకున్నాడు

ఆమె రాధ కాదు అనిపించింది వడిలిపోయిన లేత తమలపాకులా వుంది శరీరం నల్లకప్పు వేసి పోయింది ముఖంలో కళ లేదు చింపిరి జుట్టు, చిరిగిన చీర, గాజుల్లేని మొండి చేతులు అన్నం పెట్టకుండా జైల్లో వుంచిన మనిషిలా వుంది

ఎంత బాగా బ్రతికిన కుటుంబం ఎలా అయిపోయింది?

అన్నం తినబుద్ధికాలేదు కాని ఏమనుకుంటారో అని కొంచెం తిని అయిందనిపించాడు

పట్టు పరుపు మీద పవ్వళించాలని వచ్చిన వాడికి కటిక నేల ఎదురయినట్లు మధురమైన పాయసం త్రాగాలని ఆరాటపడివస్తే ఉప్పు నీళ్ళు త్రాగవలసి వచ్చినట్లు, కమ్మటి కలలు కందామని నిద్రపోతే పీడకలలు కన్నట్లు అయ్యింది

కృష్ణమూర్తి తల్లి ఇంటి విషయాలు ఏవేవో అడుగుతుంటే మొక్కు తీర్చుకున్నట్లు సమాధానం చెప్పాడు

ఆ రాత్రి——

వరండాలో మంచం వేశారు పడుకున్నాడన్న మాటేగాని నిద్ర పట్టడం లేదు సారధికి

లోపల నుంచి నెమ్మదిగా మాటలు వినిపిస్తున్నాయి

"ఆ ఉద్యోగం ఏదో అయ్యేటట్లు చూడు మన రాధని యిచ్చి చేద్దాం ఏదో ఒక ఎకరం మిగిలిందిగా అది అమ్మేస్తే ఇది ఒకింటిది అవుతుంది " కృష్ణమూర్తి తల్లి అంటూ వుంది.

"పిల్ల పెళ్ళి చూస్తానో లేదో?" మంచములో ముసలాయన గొణుక్కున్నాడు.

"ఉద్యోగం ఎలా వస్తుందమ్మా! డబ్బుగాని, రికమండేషన్‌గాని వుండాలి మనకి ఆ రెండూ లేవు" అన్నాడు కృష్ణమూర్తి

చేదుమాత్ర మింగినవాడిలా వంకర తిరిగి కడుపులో కాళ్ళు పెట్టుకొని పడుకున్నాడు సారధి

* * *

రాధకు నిద్ర పట్టడం లేదు

తేనె బొట్టుల్లాంటి ఆలోచనలు మంచు తెరల మధ్య అస్పష్టంగా అతని రూపం సముద్రంలోని అల్లా కళ్ళల్లోనే కలలు—

ఎన్నాళ్ళయింది సారధిని చూసి?

అతని అనురాగపు పలకరింపు కోసం ప్రేమగా చూసే అతని కళ్ళ కోసం ఆమె ఆతృత పడసాగింది

కాని నిజంగా తనను సారధి పెళ్ళి చేసుకుంటాడా?

ఏమో?

"నువ్వంటే నాకు ఎంత ఇష్టమో! ఎలా చెప్పను రాధా?" అన్నవాడేనా కనీసం పలకరించనైనా లేదు మొఖం వంక చూడ్డానికే వెరుస్తున్నాడేం?

అర్ధరాత్రి అయ్యింది అందరూ నిద్రపోతున్నారు రాధ లేచి వరండాలోకి వచ్చింది

రాధ చెయ్యి తగిలి కళ్లు తెరిచాడు సారధి.

గోడకు బెడ్‌లైటు వెలుగుతోంది

అతను ఆశ్చర్యాన్ని కళ్ళల్లోనూ,

పెదవుల్లోనూ ప్రదర్శించాడు.

ఆమె ముఖంలో కాంతి తగ్గినా, కళ్లల్లో ఆత్మీయత, అనురాగం తొణికిసలాడుతున్నాయి

ఆమె చూపులు అతన్ని తడుముతూ వున్నాయి

కళ్ళు పలకవు కాబట్టి ఆమె నోరు విప్పింది ఎంతకాలంగానో అణగివోయి వున్న ప్రేమానురాగాలు ఒక్కసారిగా పొంగి పొర్లుతున్నట్లుగా ఆమె పెదవులు కదిలాయి

"నన్ను మర్చిపోయావా సారధీ" ఆ మాటల్లో ఆశ, నిరాశ, అనురాగం ఆవేదన మిళితమై ప్రస్ఫుటమయ్యాయి.

ఆమె చూపుల్లోని బేలతనం, అతని గుండెల్లో గుచ్చుకొంది

లేచి కూర్చున్నాడు

ఆకాశంలో చీకటి అలుముకుంటున్నట్లు, నిరాశ అతని హృదయాన్ని చీకటి చేసింది

"చూస్తూ చూస్తూ బురదలో ఎలా కాలువెయ్యడం దరిద్రం అది బురద గూడా కాదు ఊబి పోనీ తనైనా వున్నవాడా అంటే వుహూఁ సన్యాసీ సన్యాసీ రాచుకుంటే బూడిద రాలుతుంది పుట్టిన దగ్గర్నుంచీ అన్నీ కష్టాలే కాస్త కలిగిన వాళ్ళ ఇంటికి అల్లుడైతే సుఖపడవచ్చనుకున్నాడు ఆ ఆశా నిరాశయింది"

సారధి కళ్ళల్లో అసంతృప్తి, ముఖంలో విషాదం, పెదవుల్లో శోకభారం

తను వెదుకుతున్నదేదీ అతనిలో కనిపించలేదు రాధకి

"ఎలా మర్చిపోగలను రాధా!" అని ఆమె తలమీద చెయ్యివేశాడు ఒక క్షణం ఆగి మళ్ళీ, "మీరంతా నన్ను మర్చిపోయారుగా ఈ నాలుగేళ్ళూ ఎదురు చూసి, ఎదురు చూసి కళ్ళు కాయలు కాచాయి మనం అడిగితే చులకనై పోతాం అంది మా అమ్మ. మీ అమ్మ, నాన్న కబురు చేస్తారేమో అంటే అదీ లేదు చివరకి వేరే సంబంధం కుదిరింది రాధా!" అన్నాడు సారధి

నెత్తిన పిడుగు పడిన చెట్టులా వణికి పోయింది రాధ

అతని మాటలు వాడి బాణాల్లా ఆమె హృదయానికి గుచ్చుకొన్నాయి

కన్నీళ్ళ పొరల మధ్య నీటిలో నీడలాగా అస్పష్టంగా కన్పించాడు సారధి

ఆమె గుండెల్లో గుబాళించిన గులాబులు నేల రాలాయి

తియ్యటి కలలన్నీ పీడకలలయ్యాయి

అమృతంలో గరళం ఒలికింది

రాధ మొఖాన్ని చేతులతో కప్పుకొని వెళ్ళిపోయింది

* * *

తెల్లవారింది

సారధి స్నానం చేసేసరికి, కృష్ణమూర్తి హోటల్ నుంచి టిఫిన్ తెచ్చి పెట్టాడు.

కృష్ణమూర్తి తల్లి కాఫీ ఇచ్చింది

"రాధకు వంట్లో బాగాలేదురా! వచ్చేటప్పుడు రొట్టె పట్టుకురా!" అంటోంది కృష్ణమూర్తి తల్లి

కృష్ణమూర్తి 'వూఁ' కొట్టాడు.

సారధి లోపలకు చూశాడు మంచం

మీద రాధ కళ్ళు మూసుకుని పడుకుని వుంది

రాధ కళ్ళు తెరిచింది ఎదురుగుండా డేట్ క్యాలెండర్ కన్పించింది ఆ రోజు 31 వ తారీఖు నెలలో ఆఖరు రోజు రొట్టె తేవడానికి కూడా అన్నయ్య దగ్గర డబ్బుండవు

సారథి సూట్‌కేస్ సర్దుకుంటున్నాడు

'రెండు రోజులు వుండవూ' అంటోంది అమ్మ

వెళ్ళిపోతున్నాడు

గుండెల్ని పెకలించి, మనసుని కదిలించిన వ్యక్తి ఏమీ ఎరగనట్లు వెళ్ళిపోతున్నాడు

గాలివానలో మొక్కలా కంపించిపోతోంది రాధ

ఎన్ని కలలు, ఎన్ని జ్ఞాపకాలు, మనోహర హర్మ్యాలు కూలిపోతున్నాయ్ ఆశ హారతి కర్పూరంలా హరించుకుపోతోంది

గాలివానప్పుడు మేఘాలు ఘూర్ణిల్లుతాయి పిడుగులు పడినప్పుడు చెట్టు ఫెళ, ఫెళా రవంతో కూలిపోతోంది కసాయివాడు కత్తి ఎత్తినప్పుడు మేక దీనంగా అరుస్తుంది కాని తన గుండెలు పగిలిపోతున్నా కంట తడిపెట్టగూడదు మనసు ముక్కలవుతున్నా మూలగకూడదు శరీరం మంటల్లో కాలిపోతున్నా నోరు మెదపగూడదు.

పార్థసారథి సూట్‌కేస్ చేత్తో పట్టుకుని వెళ్ళొస్తానని అందరికీ చెప్పాడు

రాధ దగ్గరికి వచ్చాడు సారథి

రాధ లేచి కూర్చోబోయింది

"ఫరవాలేదు పడుకో! ఎలా వుంది వంట్లో"

రాధ మాట్లాడలేదు

"నే వెళ్ళొస్తా రాధా"

రాధ పిచ్చిదానిలా నవ్వింది

హృదయంలో రగిలిన అగ్ని దహించుతున్నా పైకి పొగగూడా కనిపించకుండా దిగమ్రింగింది

శరీరంలో లావా ప్రవహిస్తున్నా, పైకి ప్రశాంతంగా వున్న కోనేరులా కన్పించింది

"నీ పెళ్ళికి మమ్మల్ని పిలుస్తావుగదూ" అంది

కూతురి వంక విస్తుపోయి చూసింది తల్లి

తడబడే కాళ్ళతో తుపాన్‌లా దూసుకుని బైటకు వచ్చాడు

* * *

ఇంటర్వ్యూ అయిపోయింది.

ఆ ఉద్యోగం వచ్చే ఆశ ఏమీ లేదు. కృష్ణమూర్తి అన్నట్లు తమ వద్ద డబ్బు లేదు రికమండేషన్ లేదు ఎలా వస్తుంది ఉద్యోగం

సాయంత్రం ఆరింటికి బస్సు వుంది.

కృష్ణమూర్తి బస్ స్టాండులో వుంటానని చెప్పాడు అనుకుంటూ రిక్షా వేసుకుని బస్ డిపోకి బయల్దేరాడు సారథి

సాయంత్రం ఐదున్నరయింది

కోటీ సెంటర్లో జనం సముద్ర కెరటాల్లా వున్నారు బస్సుల కోసం బడిపిల్లలు, ఉద్యోగులు బారులు తీర్చి నిల్చున్నారు స్టేజీల దగ్గర టాక్సీలు, ఆటోరిక్షాలు పిల్చినా పలకకుండా వెళ్ళిపోతున్నాయి. వచ్చిన బస్సులు నిండి, పుట్




బోర్డు మీద వ్రేలాడుతున్నారు జనం

రోడ్ మీద యాక్సిడెంట్ జరిగింది ఎవరో టాక్సీ క్రింద పడ్డారు జనం గుంపులుగా జేరారు ట్రాఫిక్ ఆగిపోయింది

సారథి ఎక్కిన రిక్షా కూడా ఆగిపోయింది అతను రిక్షా దిగి గుంపులోకి జొరబడ్డాడు

నెత్తుటి మడుగులో టాక్సీ క్రింద శవంలా పడి వున్నాడు కృష్ణమూర్తి అతని డొక్కు సైకిలు తుక్కు తుక్కయి పోయి వుంది

సారథికి క్షణంసేపు కాలం స్తంభించినట్లయింది కృష్ణమూర్తివంక చూస్తుంటే భయం వేసింది

అతను తన కోసం బస్ డిపోకు వస్తూ ప్రమాదానికి గురయ్యాడన్నమాట'

"చచ్చినట్లే వున్నాడు పాపం'"

ఎవరో అంటున్నారు

సారథి గుండెలు భయంగా కొట్టుకున్నాయి

కాళ్ళల్లో వణుకు పుట్టింది

గొంతు రుద్ధమయింది

జీవితం నీటి బుగ్గలాగ దుర్బలంగా కన్పించింది

గాలికి అల్లల్లాడేదే మనిషి బ్రతుకు అనుకున్నాడు

కృష్ణమూర్తి చనిపోయాడా'

ఎంత బాధగా వుంది తనకి' మనసున్నవాడికే ఆ బాధ'

తనింక కృష్ణమూర్తి మొఖం చూడలేడు. ఆ బాధ భరించడం తన వల్ల కాదు గుండెరాయి చేసుకున్న వాళ్ళు తప్ప తనలాటి దుర్బలులు ఇటువంటి

క్లిష్టపరిస్థితుల్ని ఎదుర్కోలేరు

ఇప్పుడా శవాన్ని పోలీసులు హాస్పటల్‌కి పంపుతారు వాళ్ళు పోస్టుమార్టం చేస్తారు శవాన్ని బంధువుల కిచ్చివేస్తారు. ఆఫీసులో తోటి ఉద్యోగులు సానుభూతి చూపిస్తారు తలా కాస్త వేసుకుని ఎలాగో శవ సంస్కారాలు ముగిస్తారు.

తను వుండి చేసేది ఏముంది? చేసేది లేకపోగా చేతి చమురు గూడా పడ వచ్చును

సారధి గుంపులోంచి తప్పుకుని వచ్చి రిక్షా ఎక్కి కూర్చున్నాడు

"ఎవరు సార్?" అన్నాడు రిక్షావాలా

"ఏమో ఎవరో? ఎలా తెలుస్తుంది? అరె రె అప్పుడే అయిదూ ముప్పావు అయ్యిందే తొందరగా పోనీ బస్సు పైమయ్యింది " అంటూ తొందర చేశాడు సారధి

రోడ్డు ప్రక్క నుంచి ఎలాగో వీలు చూసుకొని రిక్షా లాగించాడు రిక్షావాలా

* * *

కథ అంతటితో అయిపోలేదు.

మరొక నాలుగేళ్ళకు పొడిగింది

హైదరాబాద్ ఆబిడ్ సెంటర్ జన సమర్దంగా వున్న సాయంకాల సమయం ఒక టాక్సీ ఒక వ్యక్తి వెనక సడన్ బ్రేక్‌తో ఆగింది

ఆ వ్యక్తి తూలి పడబోయి తమాయించుకున్నాడు

"ఏరా! ఇంటి దగ్గర చెప్పి వచ్చావా?" అన్నాడు డ్రైవర్ కోపంగా

"చెప్పే వచ్చాను" అన్నాడా వ్యక్తి

టాక్సీలో కూర్చున్న యువతి కుతూహలంగా అతన్ని చూసింది అతని గడ్డం మాసి వుంది, బట్టలు నలిగి, మురికి పట్టి వున్నాయి నిరాశా, నిస్పృహ అతని కళ్ళల్లో తాండవిస్తున్నాయి

అంతలో అతని కళ్ళు పాల నురగల్లా తెల్లబడ్డాయి మొఖంలోకి జీవకళ వచ్చింది,

టాక్సీ డోర్ దగ్గరగా వచ్చి "రాధా!" అన్నాడు

రాధ అతన్ని పరీక్షగా చూసి "సారధీ. నువ్వా?" అంటూ టాక్సీ తలుపు తీసి "ఎక్కు" అంది

సారధి మారు మాట్లాడకుండా ఎక్కి కూర్చున్నాడు

రాధలో చాలా మార్పు వచ్చింది ఆమె చూపుల్లో కాంతి కన్పిస్తోంది శరీరం మేలిమి బంగారంలా మెరుస్తూంది ముట్టుకుంటే మాసిపోయే మల్లెపూల్లా వున్నాయి ఆమె చెక్కిళ్ళు బిగుతుగా తొడుక్కున్న జాకెట్టు, పల్చటి చీరలో కళ్ళు త్రిప్పుకోలేనంత అందంగా కన్పించింది చూస్తుంటే మనసు అదుపు తప్పేంత ఆకర్షణీయంగా వుంది


ఆమె ఎడమ చేతికి రిస్టు వాచీ వుంది కుడిచేతికి నాలుగు బంగారు గాజులున్నాయి మెడలో సన్నటి గొలుసు వుంది చేతిలో వ్యానిటీ బ్యాగ్ వుంది

సారధి ఆశ్చర్యంలో మునిగిపోతున్నాడు

"ఇప్పుడు చెప్పు ఇక్కడున్నావేం?" అంది రాధ

సారధి తన కథ చెప్పాడు.

ఉద్యోగం ఇప్పించే షరతుమీద పెళ్ళి




చేసుకున్నాడు ఇక్కడే ఒక కంపెనీలో ఉద్యోగం వేయించాడు మామగారు

సారధి తండ్రి స్కూల్ మాష్టర్‌గా రిటైర్ అయ్యాడు కాని క్షయవ్యాధి వచ్చింది తల్లికి ఆరోగ్యం బాగా లేదు వచ్చిన జీతం తండ్రికి వచ్చే పించనూ అంతా టానిక్‌లకు పాలకి పళ్ళకి చాలడం లేదు అప్పులు పెరిగిపోయాయి

తప్పనిసరి అయిన పరిస్థితుల్లో అవి నీతికి పాల్పడ్డాడు

ఫలితంగా సస్పెండ్ చేశారు వారం రోజులయ్యింది

ఈ దరిద్రం బాధ తట్టుకోలేక యీ రోజు చావాలనే బయల్దేరాడు

అంతా విని రాధ నవ్వింది

ఎంత కాలం కష్టపడను అంటూ కన్నీళ్ళు పెట్టుకున్నాడు సారధి

అసలు మనిషి పుట్టడమే కష్టాల కోసం అంది రాధ

సారధి మాట్లాడలేదు

నువ్వేమీ దిగులుపడకు సారధీ ఎల్లుండి మామూలుగా కంపెనీ కెళ్ళు నీ ఉద్యోగం నీకు రెడీగా వుంటుంది అంది రాధ

నమ్మలేనట్టు చూశాడు సారధి

ఏం నమ్మకం లేదా? సారధీ ఆ కంపెనీ మా బంధువులదే అంది రాధ

జారిపోతున్న జీవితాన్ని చేతిలో పెట్టి నట్లయింది

చీకట్లో మునిగిపోయిన వాడు వెలుగు లోకి వచ్చినట్లయింది

భయంకరంగా ఘీంకరిస్తూ తనని త్రొక్కడానికి వస్తున్న మదించిన ఏనుగు ఏ దివ్యశక్తికో లొంగిపోయి అతి విన

యంగా వంగిపోయి తన మెడలో పూల హారం వేసినట్లయింది.

ఏదో అడగాలని అతను నోరు తెరిచాడు కాని అడగలేకపోయాడు. బాధపడే కళ్ళతో చూశాడు.

"నా గురించి తెలుసుకోవాలనుకుంటున్నావు కదూ!" అని నవ్వి "మరొకసారి చెప్తాను" అంది రాధ.

"అంతా బాగున్నారా రాధా?"

"బాగున్నారు. నాన్న మంచంలో వున్నారు. అన్నయ్య కాళ్ళు విరగ్గొట్టుకుని చక్రాల బండిలో కూర్చుని వున్నాడు. అమ్మ మాత్రం లేదు. నాకు పెళ్ళికాలేదని దిగులుతో పోయింది."

ఆమె మొఖం చూశాక ఇంకేవీ అడగాలనిపించలేదు సారథికి.

ఇంటి దగ్గర దింపింది సారథిని. ఇంట్లోకి రమ్మంటే రాలేదు. మరొకసారి వస్తానని వెళ్ళిపోయింది.

*   *   *

సస్పెండయిన సారథి తిరిగి పనిలో చేరాడు.

ఒక నెల తిరక్కుండానే ప్రమోషన్ గూడా వచ్చింది.

గాలివాన వచ్చినట్లుగా ఒక ఆదివారం చిన్న కార్లో వచ్చి దిగింది రాధ.

దివినుంచి భువికి దిగివచ్చిన దేవతలా మెరిసిపోతున్నది.

"చూశావా! మీ ఇల్లు గుర్తుపట్టేశాను" అంది గర్వంగా.

సారథి చాలా సంతోషించాడు.

అతని తల్లి, తండ్రి చాలా ఆదరంగా చూశారు.

"నీ భార్యని చూపించలేదేం?" అంది రాధ.

సారథి తల్లి బావురుమంది.

సారథి బెడ్ రూమ్‌లోకి వెళ్ళిపోయాడు.

అతని వెనకనే వెళ్ళి భుజంమీద చెయ్యి వేసింది.

"అదిపోయి సంవత్సరం అయ్యింది" అన్నాడు బాధగా.

రాధ విచారపడింది. చాలా సానుభూతి చూపించింది. కొంచెంసేపు కూర్చుని "వస్తాను సారథీ" అని లేవబోయింది..

సారథి ఆమె చెయ్యి పట్టుకున్నాడు అకస్మాత్తుగా.

"రాధా!" అన్నాడు. అతని గొంతు ఎందుకో వణుకుతున్నది.

రాధ విచిత్రంగా చూసింది.

"నిన్ను పెళ్ళిచేసుకుంటాను" అన్నాడు ఆవేశంగా.

రాధ పక, పకా నవ్వింది. పిచ్చి, పిచ్చిగా నవ్వింది. విరగబడి నవ్వింది.

"పిచ్చి సారథీ!.... ఎంగిలి కూడు తింటావా?...." అని పిచ్చిగా నవ్వింది. కన్నీళ్ళు తుడుచుకుంటూ ఎలా వచ్చిందో అలాగే వెళ్ళిపోయింది రాధ.

గుండెల్లో రోకలి పోటు తగిలింది సారథికి.

ఎవరో తన గోళ్ళల్లో గుండుసూదులు గుచ్చుతున్నట్లూ, బ్రతికుండగానే చర్మాన్ని వలుస్తున్నట్లు విలవిల్లాడిపోయాడు.

చీకటి భయంకరంగా చేతులు చాచుకుని ప్రపంచాన్ని కౌగలించుకుంది.

కిటికీలోంచి వచ్చిన గాలి అతన్ని ఓదార్చడానికా అన్నట్లు చల్లగా తగిలింది.

★